
క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానంలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారిని రథయాత్ర పట్టణ పురవీధుల్లో నిర్వహించి కలశలతో మహిళలు రథయాత్రలో పాల్గొన్నారు.

అమ్మవారికి శ్రావణమాస పూజలు



మాచర్ల: శ్రావణమాసం పురస్కరించుని పట్టణంలో సత్యసాయిబాబా మందిరంలో గాయత్రి, లలితాదేవి అమ్మవారిని లక్ష గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ఆలయ కమిటీ అర్చకుడు కె.వీరాంజనేయులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మహిళా భక్తులు మంగళ గౌరీ వ్రతం, కుంకుమపూజా కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ప్రతి ఒక్కరూ కలిసిరావాలి



గురజాల: ఎస్సీ వర్గీకరణకు ప్రతి ఒక్కరూ కలసి రావాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. నగర పంచాయతీలోని బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వీఎంఏఎస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. త్వరలో నిర్వహించనున్న హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్సింగ్, పేరుపోగు సైదులు, ఎం.సత్యానందం, సుశీల, బాబు, జె.బాబు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో 21 రకాల సేవలు



నకరికల్లు: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రభుత్వం 21 రకాల కార్యక్రమాలు భవిత కేంద్రాల ద్వారా నిర్వహిస్తోందని ఐఈఆర్‌పీ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు మంగళవారం స్పీచ్‌థెరపి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి గురువారం ఉచిత ఫిజియోథెరపి క్యాంపు ద్వారా వ్యాయామాలు చేయించి ఇంటి వద్ద తిరిగి చేసుకునేలా తర్ఫీదు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి శనివారం గుర్తించిన ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల ఇంటి వద్దకు వెళ్లి సేవలు అందిస్తామని తెలిపారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లులో భాగంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి పీడీ శివలింగం ఆదేశించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని లే అవుట్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ నెల 30న గృహ ప్రవేశాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆర్చీ పనులు వెంటనే చేపట్టాలన్నారు. ఆయనతో పాటు గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహానికి హెల్త్ సూపర్‌వైజర్ సి.హెచ్. చలపతిరావు క్రీడా సామగ్రి వితరణగా అందజేశారు. సుమారు రూ.3 వేలు విలువ చేసే చదరంగం, చైనీస్ చక్కర్, స్కిప్పింగ్ తాళ్లు, టెన్నికాయిడ్, క్యారమ్‌బోర్డు వంటివి తదితర ఆట వస్తువులను బొల్లాపల్లి పి.హెచ్.సి. వైద్యాధికారి పి.శంకర్‌నారాయణ చేతుల మీదుగా వసతి గృహం వర్డెన్ నాగేంద్రంకు, విద్యార్థులకు అందజేశారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో పేదలకు నవరత్నాలు ప్రభుత్వం అందిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. లబ్ధిదారులకు పింఛన్ల దగ్గర నుంచి అమ్మ ఒడి వరకు పథకాల అమలుపై ఆరా తీశారు. వ్యక్తి గతంగా కుటుంబానికి చేరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ ప్రజల మన్ననలు పొందుతున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి సీఎంను చేసుకునేందుకు సహకరించాలని కోరారు. అర్హులు ఉండి పథకాలు పొందకుంటే వారికి కూడా న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష నిర్వహించి గుర్తించినట్లు చెప్పారు. దేశంలో విద్యా, వైద్యం, నవరత్నాల పేరుతో పేద ప్రజలకు సేవలందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతోందని పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో ఇప్పటి వరకు నాలుగు సంవత్సరాల్లో 98 శాతం అమలు చేయడం జరిగిందని వివరించారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో 80 శాతం విజయం సాధించినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఈ పథకాలు పొందాలంటే మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు 2024లో మద్దతు తెలపాలని కోరారు. విశ్వబ్రాహ్మణ, తొమ్మిదో వార్డులోని ఎస్టీ కాలనీ, పలు ప్రాంతాల్లో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీరు, ఇళ్ల స్థలాలకు సంబంధించి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వార్డులో వందలాది మంది ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, కౌన్సిలర్లు శ్యామలాజ్యోతిచంద్ర, పేరాల సిద్దయ్య ఆధ్వర్యంలో అల్పాహార విందు అందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, బి.రఘురామిరెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కె.కోటయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లు కె.శ్రీను, షేక్ కరీముల్లా, మస్తాన్, దస్తగిరి, చందుగౌడ్, శంకర్, కో ఆప్షన్ మెంబర్లు, యాసిన్, మున్సిపల్ కమిషనర్ రమణబాబు పాల్గొన్నారు.

సీపీఐ బస్సుయాత్రను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి హుసేన్



బస్సుయాత్ర గోడ పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుసేన్

రెంటచింతల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు ఈ నెల 27న తలపెట్టిన బస్సుయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుసేన్ కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల పార్టీ కార్యదర్శి కె.రంగనాయకులు అధ్యక్షతన నిర్వహించిన మాచర్ల ఏరియా సమితి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా సాతులూరు గ్రామం వద్ద మధ్యాహ్నం 2గంటలకు బస్సుయాత్రకు ఘనంగా స్వాగతం పలికేందుకు, నరసరావుపేటలో జరిగే రోడ్డుషోను, వినుకొండలో సాయంత్రం 5గంటలకు నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయడానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, సీపీఐ ఏరియా కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, సీపీఐ నాయకులు సైదా, ఎం.బాబూరావు, కె.శివయ్య, ఇందురు శ్రీను, సీహెచ్ అమరేశ్వరరావు, వి.గరలరావు, కె.దావీదు, డి.శ్రీనివాసరావు, ఎ.సామేల్‌జాన్ పాల్గొన్నారు.

దాచేపల్లి తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు నాయక్



దాచేపల్లి: తహసీల్దార్‌గా రమావత్ వెంకటేశ్వర్లు నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈపూరు ఇక్కడకి బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు నాయక్‌ను సిబ్బంది సన్మానించారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన టి.ప్రవీణ్‌కుమార్‌ను పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఆర్థిక సాయం

విజయపురిసౌత్: మాచర్ల మండలం నాగులవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇటీవల కటికల వందనం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మంగళవారం మృతుడు వందనం కుటుంబ సభ్యులకు మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు రూ.10 వేలు సాయం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదలకు చెందిన భార్యాభర్త ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయపడిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. మండలంలోని మాదల ఎస్సీ కాలనీకి చెందిన బొడ్డేటి వెంకయ్య భార్యతో కలసి ద్విచక్రవాహనంపై ముప్పాళ్ల నుంచి వస్తూ ప్రమాదవశాత్తూ పెట్రోల్ బంక్ సమీపంలో కింద పడ్డారు. ఎవరూ పట్టించుకోకపోవటంతో, అదే సమయంలో సత్తెనపల్లి నుంచి వస్తున్న మాజీ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వరరెడ్డి గమనించారు. వెంటనే కారు దిగి చికిత్స నిమిత్తం ఆటోలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు పంపించారు.

కళాకారులకు నంది, నటరాజ అవార్డులు

నరసరావుపేట రూరల్: హైద్రాబాద్ త్యాగరాజ గానసభలో సోమవారం ఆదర్శ కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్యనీరాజనంలో పట్టణానికి చెందిన శివానంద కళాక్షేత్రం చిన్నారులు 20 మంది ఆదర్శనం నంది అవార్డులు, ఆరుగురు నటరాజ అవార్డులు కైవసం చేసుకున్నారు. అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు ఇతర సంస్కృత కీర్తనలతో చిన్నారి కళాకారులకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పల్నాడులో ప్రధానమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి పాట నీరాజనంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాతృ శివానంద కళాక్షేత్రం నిర్వాహకుడు డాక్టర్ పాలూరి కృష్ణవాసు శ్రీకాంత్‌ను ఆదర్శ కళానిలయం నిర్వాహకులు నటరాజ స్వామివారి ప్రతిమతో సత్కరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



స్వామివారి ప్రత్యేక పూజల్లో ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: మండలంలోని రచ్చమల్లపాడు గ్రామంలో శ్రీనాదిసిల(బొడ్డురాయి) మహాసితల శ్రీగమిడి సిలాయమంత్ర పోలేరమ్మ మాతా, పెద్దమ్మ తల్లి, పోతురాజుస్వామి వార్ల శిలా విగ్రహాల ప్రతిష్టా మహోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కలిసి ప్రతిష్టా మహోత్సవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు, సిద్ధాంతి పోతులూరి శివరామాచారి ఆధ్వర్యంలో 11 మంది వేద పండితులు ప్రతిష్టా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదుగురు పుణ్యదంపతులు మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతా శివరామయ్య, గ్రామసర్పంచి అనూసయ్య, ఎంపీటీసీ మంగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గార్లపాటి పెదరామయ్య, గార్లపాటి వెంకట్రామయ్య, మాజీ ఎంపీపీ టి.వెంకయ్య, టి.బ్రహ్మం, టి.వెంకటేశ్వర్లు, మారుకొండయ్య, రామిరెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

ఆట్యా–పాట్యా క్రీడాకారులకు అభినందనలు



జూనియర్ ఆట్యా-పాట్యా జట్టు క్రీడాకారులతో ఉపాధ్యాయులు

నకరికల్లు: రాష్ట్ర స్థాయి ఆట్యా-పాట్యా జూనియర్ విభాగం చాంపియన్‌గా పల్నాడు జిల్లా జట్టు నిలిచింది. ఆ జట్టులో స్థానిక జెడ్పీ స్కూల్ విద్యార్థులు ఎనిమిది హాజరై ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు టి.నగేష్ మాట్లాడుతూ ఆట్యా- పాట్యా పల్నాడు జిల్లా బాలుర జట్టులో కె.శ్రీనివాస్, షేక్ ఇస్మాయిల్, బాలికల జట్టులో పి.తిరుపతమ్మ, టి.రామాంజలి, పి.స్రవంతి, కె.సరిత, బి.మౌనిక, కె.సౌమ్యశ్రీ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ షేక్ మస్తాన్‌వలి, ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, సిబ్బంది కె.వెంకటేశ్వరరావు, ఎం.అశోక్, సీహెచ్ ఓబయ్య, కె.సువర్ణరాజు, టి.కిరణ్మయి, ఏ స్వర్ణకుమారి, కె.హేమలతాకుమారి పాల్గొన్నారు.

అధిక ధరలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య

సత్తెనపల్లి: కేంద్ర, అధిక ధరలు తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య కోరారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ పల్నాడు జిల్లా శాఖ కార్యదర్శుల జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటి నుంచి 7వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్, ఇతర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్టు 24న దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాల నాయకులతో ఢిల్లీలో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సీపీఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, గంజి మాల రవిబాబు, ఎస్.ఆంజనేయ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు గుంటుపల్లి బాలకృష్ణ, గద్దె ఉమశ్రీ, ధరణికోట విమల, శివకుమారి, హనుమంతురెడ్డి, గుంటూరు మల్లేశ్వరి, పాల్గొన్నారు.

చిన్నారులకు చేయూతనందించాలి



సత్తెనపల్లి: మురికివాడలో నివసిస్తున్న చిన్నారులకు ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని ది హెల్ప్ టు హోప్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కె.రవికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వడ్డవల్లి ఏరియాలోని మురికివాడల్లో మంగళవారం చిన్నారులకు ఆహారం అందించి గుడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికివాడల్లో నివసిస్తున్న చిన్నారులకు తమకు తోచిన సాయాన్ని అందించాలని కోరారు. ఆరోగ్యపై చిన్నారులకు అవగాహన కల్పించారు.

బీసీ గర్జన విజయవంతం



పట్టణంలో ప్రత్యేక వాహనంపై ర్యాలీగా వస్తున్న మంత్రులు కారుమూరి, అంబటి, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

సత్తెనపల్లి: సత్తెనపల్లిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ గర్జన విజయవంతమైంది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన సభకు పెద్దసంఖ్యలో బీసీలు తరలివచ్చారు. తొలుత పట్టణంలో ప్రత్యేక వాహనంపై అతిథులు ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు. గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, విద్యాభివృద్ధి మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన యనమల నాగార్జున యాదవ్‌లను పూలమాలలు, గజమాలతో సత్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలికారు.

సంక్షేమంతో పేదలకు ఆర్థిక స్వావలంబన

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సంక్షేమంతో పేదల ఆర్థిక అభివృద్ధి కోసం సుమారు రూ.400 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరై ముందుగా ఐలాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వెళ్లే రహదారి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరై ఇప్పటి వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నవరత్నాల ద్వారా ప్రజలకు అందించిన సంక్షేమం గురించి వివరించారు. అలాగే స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో రోడ్డు విస్తరణ చేయాలని కొందరు, మరికొంత మంది విద్యుత్ స్తంభాలు అసౌకర్యంగా ఉన్నాయని తెలపటంతో తక్షణమే ఎమ్మెల్యే స్పందించి తక్షణమే రెండు రోజుల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే తన సొంత డబ్బులు అయినా కేటాయించి పనులు చేయిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. కౌన్సిలర్ నేలటూరి బాలస్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పిడుగురాళ్ల అభివృద్ధి...

పిడుగురాళ్ల పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో సుమారు 8 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వటమే కాకుండా ఒక్కొక్కరికి రూ.2 లక్షలతో ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్నారు. పిడుగురాళ్ల ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు బైపాస్ రోడ్డును పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని మెయిన్ రోడ్డును విస్తరించినట్లు వివరించారు. జానపాడు రోడ్డులోని రైల్వే బ్రిడ్జికి కూడా త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నేలటూరి బాలస్వామి, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్ షేక్ జైలాబ్దిన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల దాసు, బాలస్వామి, నేలటూరి అనిల్, పాశం బెనహర్, కో ఆప్షన్ సభ్యులు పిల్లి ప్రేమానందం పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధి గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



వృద్ధులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తున్న చిరంజీవి అభిమానులు

పిడుగురాళ్ల: పట్టణంలో మెగా స్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని సాయివృద్ధాశ్రమంలో చిరంజీవి అభిమానులు, కాపు సంఘం నాయకులు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రమేష్, ఎ.రామకృష్ణ, రంగా, బయ్యరపు రమేష్, ఉమామహేశ్వరరావు, పసుపులేటి నరసింహారావు, ప్రసాద్, నాగేశ్వరరావు, బుడే, తోటా రామదాసు, ఆవుల రమేష్, మాటూరి లింగయ్య, సాయి, గౌరీ, సాగర్ పాల్గొన్నారు.

దుర్గి: మండలం పరిధిలోని ఆత్మకూరులోని శ్రీ కాశినాయన వృద్ధాశ్రమంలో మంగళవారం సినీ నటుడు మెగా స్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాచర్ల నియోజకవర్గం కాపు జేఏసీ అధ్యక్షుడు వెలిదండి బాలశంకర్, మాచర్ల మండల కాపు జేఏసీ అధ్యక్షుడు జక్కా నరసింహారావుల ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించి, కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు పులి హరి, వెలిదండి గోపాలరావు, నక్షత్రపు ప్రసాదరావు, వెలదండి శ్రీనివాసరావు, చిమట వెంకటేశ్వర్లు, ఆవులు వెంకటేశ్వర్లు, మారాబత్తుల రమేష్, సాగి శ్రీనివాసరావు, కోరబోయిన గణేషు, కటకం నరేష్, నార్ల అంకారావు, కేసనపల్లి కృష్ణబాబు, రిలయన్స్ వెంకటేశు పాల్గొన్నారు.

గురజాలలో..

గురజాల: సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో కాపు జేఏసీ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాపు జేఏసీ మండల అధ్యక్షుడు జక్కా రవిబాబు, నాయకులు కె.ఉదయ బాస్కర్, కటికం అంకారావు, జక్కా రవి, జక్కా సత్యం, చలవాది నారాయణ, కనకం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో అభివృద్ధి పనులు



మైదానాన్ని ట్రాక్టర్లతో చదును చేస్తున్న దృశ్యం

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి చేయిస్తున్నట్లు శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో శిథిలావస్థకు చేరిన భవన సముదాయాలు పడివేసిన ఏరియాలో వర్షం వచ్చినప్పుడు నీరు నిలబడి విద్యార్థులు అగచాట్లు పడుతున్నాయని, విష సర్పాలు సంచరిస్తున్నాయని గుర్తించామని దీంతో యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించామన్నారు.

పొక్లెయిన్, డోజరు, ట్రాక్టరు యంత్ర పరికరాలు ద్వారా గుంతను పూడ్చివేయటంతో పాటు బాలికల టాయిలెట్స్ సమీపాన లెవలింగ్ పనులు చేయిస్తున్నామన్నారు. త్వరలో మండలస్థాయిలో శావల్యాపురం హైస్కూల్లో జరగనున్న ఆడుదాం ఆంధ్రా వివిధ రకాల క్రీడా పోటీలకు క్రీడా మైదానం ఎంతోగానో దోహదపడుతుందన్నారు. పనులు పరిశీలించిన వారిలో పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, శ్రీకాంత్ ఉన్నారు.